క్లుప్తంగా

నేడు గృహ సారథులకు శిక్షణ

పెదకూరపాడు: మండలంలోని 14 గ్రామ సచివాలయాల గృహ సారథులు, కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం సోమవారం పెదకూరపాడులోని ఎస్‌సీస్టీ కాల్వ వద్ద షాదీఖానాలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్ కుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు చిన్నమక్కెన, లింగంగుంట్ల, ముస్సాపురం, పడపాడు, పాటిబండ్ల గ్రామాలకు ఉదయం 11 గంటలకు హుస్సేన్ నగరం, రామపురం, బుచ్చయ్యపాలెం, గారపాడు, లగడపాడు, కనిగండ్ల గ్రామాలకు మధ్యాహ్నం 12గంటలకు 75త్యాళ్ళూరు, జలల పురం, అబ్బురాజు పాలెం గ్రామాలకు, మధ్యాహ్నం 1గంటకు బలుసుపాడు, కమ్మంపాడు, పరస, కాశీపాడు, తమ్మవరం గ్రామాల వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరు కానున్నట్లు తెలిపారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్

క్రోసూరు: క్రోసూరు ఎస్సీ కాలనీకి చెందిన బీటెక్ విద్యార్థినికి మాగులూరి ఫౌండేషన్ ప్రతినిధులు ల్యాప్‌టాప్ అందజేశారు. హైదరాబాద్‌లో జాబ్ కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థిని ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సహాయం అందించినట్లు వారు ఆదివారం తెలిపారు. ఫౌండేషన్ ద్వారా 340 మందికి సేవా కార్యక్రమాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ స్టేట్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాగులూరి హరిబాబు, షభ్యులు కృష్ణారావు, కిరణ్, ప్రసాద్, సుబ్బారావు, వాసు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ



అమరావతి: మండల పరిధిలోని అత్తలూరు గ్రామంలో పూదోట కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ పూదోట పాపారావు జన్మదిన సందర్భంగా వృద్ధులకు, దివ్యాంగులకు సాయమందించారు. ఆదివారం అత్తలూరులో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే రాజయ్య ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థినులకు సైకిళ్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వృద్ధులకు రూ.1,500ల విలువచేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్పీఎం ఫాదర్‌లు పూదోట బాలరాజు, నవీన్, పూదోట అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి శాంతికల్యాణం

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణవేడుకలు ఆదివారం కనులపండువగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం అయిన శ్రవణం పురస్కరించుకొని వేడుకలు జరిపించారు. అర్చకులు వినుకొండ కృష్ణకాంతాచార్యులు, నరసింహమూర్తి ఆచార్యులు, సూర్యప్రకాశ్‌శర్మ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విశేష అభిషేకాలతో పాటు పంచామృతస్నపన, గంధమార్చనలు, హరిద్రార్చనలు చేశారు. అమ్మవారిని, స్వామివారిని విశేషంగా అలంకరించారు. పలుగ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివార్ల శాంతికల్యాణంలో పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి మహా అన్నాభిషేకం

నకరికల్లు: స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారిని విశేష అభిషేకాలు, మహాఅన్నదానం ఆదివారం నిర్వహించారు. స్వామివారి నామస్మరణ జపిస్తూ శనివారం ప్రారంభించిన ఏకాహం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. 108కేజీల అన్నంతో చేసిన అన్నాభిషేకాన్ని తిలకించిన భక్తులు తరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో విశేషపూజాధికాలు చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు. అనంతరం చేపట్టిన అన్నదానంలో భక్తులు వేలాదిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఎంపీని కలిసిన ఏఎంసీ చైర్మన్ బాబూరావు




సత్తెనపల్లి: నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలును, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను గుంటూరులో ఆదివారం సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన పెంటెం బాబురావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడి రెక్క దేవదాసు, నాయకులు జూపల్లి పాల్, ఉల్లంఘుల ప్రసాద్ బాబు, గుంటూరు ఆశీర్వాదం ఉన్నారు.

పొందికైన అక్షరాలు.. ఉత్తమ ఫలితాలు

భాషేదైనా భావాన్ని సులభంగా అందించేది చూడ చక్కని దస్తూరీయే. అక్షరాలను ముత్యాల్లా రాసే అలవాటును సొంతం చేసుకుంటే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ శ్రేణి సాధించ వచ్చునంటున్నారు నిపుణులు. త్వరలో విద్యార్థుల జీవితాలకు మేలి మలుపు ల్లాంటి కీలక పరీక్షలు రానున్న వేళ చేతిరాతపై ప్రత్యేక కథనం..

- మెలకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు
- మంచిమార్కుల కోసం చేతిరాతపై శ్రద్ధ చూపాలంటున్న నిపుణులు



నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేతిరాత పై సాధన చేస్తున్న టెన్త్ విద్యార్థులు

సత్తెనపల్లి: ప్రపంచ చరిత్రకు మూలాధారం అక్షరాలే. ఉలితో రాళ్లపై అక్షరాలు చెక్కిన కాలమైనా.. కీ బోర్డుపై అక్షరాలను కదిలించే కంప్యూటర్ యుగమైనా అక్షరాలది చెక్కుచెదరని స్థానమే. చేతిరాతను బట్టి వారి గుణగణాలను అంచనా వేయవచ్చంటారు గ్రాఫాలజిస్టులు. భాషేదైనా భావాన్ని సులభంగా అందించేది చూడ చక్కని దస్తూరీయే. అక్షరాలను ముత్యాల్లా రాసే అలవాటును సొంతం చేసుకుంటే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ శ్రేణి సాధించ వచ్చునంటున్నారు నిపుణులు. మార్చి 15 నుంచి ఇంటర్మీడియెట్, ఏప్రిల్ 3 నుంచి పదవతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అదనపు మార్కుల సాధనలో రాత ఎంతో కీలకం. సమాధాన పత్రం మూల్యాంకనం చేసే ఉపాధ్యాయుల మనస్సును హత్తుకొనేలా దస్తూరి విషయం ఉంటే గరిష్ట మార్కులు సాధించవచ్చు. ప్రత్యేక తరగతులతో పాటు చేతిరాత మెరుగు పరిచేలా ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు, మెలకువలను చెబుతున్నారు.

సాధన ఇలా...

- నేర్చుకోవాలనే ధ్యాస, నిరంతర సాధన ద్వారా కేవలం 21 రోజుల్లోనే చేతిరాతలో గణనీయమైన మార్పును సాధించవచ్చునని నిపుణులు చెబుతున్నారు.
- సమాధాన పత్రం రాసేటప్పుడు కూర్చునే భంగిమ, కలాన్ని పట్టుకొనే విధానం, కాగితానికి, కలానికి మధ్య దూరం వంటి అంశాలు కీలక పాత్ర వహిస్తాయి.
- రాసే పరీక్ష పేపర్ పై పెన్ పెట్టినా అంగుళం దూరంలో పాళీ ఉంచాలి.
- సున్నా, అరసున్నా, నిలువుగీతల విషయాలపై బాగా సాధన చేయాలి.
- ఆంగ్ల, తెలుగు భాషల్లో మెరుగైన రాత కోసం అపసవ్య దిశలో రాయడం రావాలి. -జవాబులు రాసేటప్పుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకు కూర్చొని రాయడం మంచిది.
- అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగిన ఖాళీ ఉండేలా చూడాలి.

పరీక్ష వేళ తీసుకోవలసిన జాగ్రత్తలు...

- సమాధాన పత్రంలో వాక్యాలు పైనుంచి కిందకు కింద నుంచి పైకి వరుస క్రమంలో ఉండేలా రాయాలి.
- జవాబు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పత్రాన్ని దిద్దే ఉపాధ్యాయులు అదనపు మార్కులు వేసే అవకాశం ఉంటుంది.
- ఒక పేజీకి 16 నుంచి 20 పంక్తులు మించకుండా ఉండాలి.
- ప్రతిరోజు కొద్దిసేపు రాతపై సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- ఎన్‌టిపిను దూరంగా పట్టుకుని రాస్తే అక్షరాలు గుండ్రంగా వచ్చే అవకాశం ఉంటుంది.

అక్షరమాల ఓ ఆయుధం



మంచి ఫలితాల సాధనకు చక్కటి అక్షరమాల ఓ ఆయుధమని చెప్పవచ్చు. సమాధాన పత్రం దిద్దే అధ్యాపకుడికి ఆ పత్రం అందంగా కనిపించడం వల్ల మార్కులు పెరిగే అవకాశం ఉంటుంది. పాఠ్యాంశాల పునశ్చరణతోపాటు గుండ్రని చేతిరాత పై పట్టు సాధించాలి.

–ఎ.శ్రీనివాసరావు, ఎంఈఓ, సత్తెనపల్లి

ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం కలిగించాలి

గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే నంబూరు దిశానిర్దేశం



శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు

క్రోసూరు: గృహ సారథులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి, 'మా నమ్మకం నువ్వే జగన్' అనేలా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం కలిగించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నిర్దేశించారు. ఆదివారం క్రోసూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల గృహ సారథులకు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. మార్చి 18న జగనన్నే మా భవిష్యత్తు అనే కిట్లు అందజేయటం జరుగుతుందని తెలిపారు. ఆ రోజు నుంచి ప్రచారం కార్యక్రమం ప్రారంభించాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి బయట జగనన్న స్టిక్కర్లు అంటించాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీల పేరుతో చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జడ్పీటీసీ షేక్ జమీలా, సచివాలయ కన్వీనర్ సయ్యద్ రహీం, మండల కన్వీనర్ వెలది అప్పారావు, సర్పంచ్ మల్లా చందమామ, ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లేళ్ల వెంకట్రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, డాక్టర్ మహ్మద్ షరీఫ్, పాశం శ్రీనివాసరెడ్డి, షేక్ ఖాదర్, చిన్నబాబు, షేక్ గఫూర్, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నారు శ్రీనివాసరెడ్డి, వేణు గోపాలరెడ్డి, గల్లా గురుపాదం, బయ్యవరం మస్తాన్‌రావు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలన దేశానికే ఆదర్శం

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలన, ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అచ్చంపేటలోని సచివాలయం -1 పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. ఇంటింటికీ తిరిగి అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ వంటి వాటిని కేంద్రం కూడా అమలు చేయాలన్న ఆలోచనలో పడిందన్నారు. అచ్చంపేటకు రూ.70కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు అందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. రూ.1.50కోట్లతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, రూ.1.75కోట్లతో పోలీస్ స్టేషన్, రూ.1.60కోట్లతో కస్తూర్బా గాంధి జూనియర్ కళాశాల, రూ.1.85కోట్లతో గురుకుల పాఠశాల అదనపు తరగతి గదులు, రూ.1.80కోట్లతో జడ్పీ పాఠశాల అదనపు తరగతి గదులు భవనాలు నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ కంభాల వీరబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, ఎంపీటీసీలు గంగసాని బాబు, తెల్లమేకల నాగరాజు, షేక్ మొహిద్దీన్, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి చిన్నయల్లమందయ్య, సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి, అచ్చంపేట పార్టీ కన్వీనర్ సమరం, ఆర్యవైశ్య సంఘ నాయకులు అన్నవరపు శ్రీనివాసరావు, మండల బీసీ సేన అధ్యక్షులు షేక్ జాని, మైనార్టీ నాయకులు కమల్‌సైదా, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, షేక్ సుభాని, జాని, నాగులు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: మండల సర్వతోముకాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పాటు పడాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ ఎలవర్తిపాటి షేక్ జై బున్ బీ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన ఎక్స్ అఫీషియో హోదాలో హజరై మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం ప్రతి గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణను సక్రమంగా చేపట్టాలన్నారు. తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అక్కడ పని చేస్తున్న క్లాప్ మిత్రల కుటుంబాలు సైతం ఆర్థికంగా నిలదొక్కుకుంటాయ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి అయిన గ్రామాల్లో సచివాలయాలకు మంజూరు అయిన నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచిం చారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు-అందరికీ ఇళ్లలో భాగంగా పేదలకు మంజూరైన జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాన్ని ఉగాది లోపు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యాదర్శులు, తదితరులు ఉన్నారు.

నేడు అచ్చంపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

అచ్చంపేట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అచ్చంపేటలోని సచివాలయం -1 పరిధిలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం రెండవ రోజు పర్యటించనున్నారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొనవలసిందిగా పేర్కొన్నారు.

ముప్ఫై మూడేళ్లకు.. మునుపటిలా..



ఒక్కటైన పూర్వ విద్యార్థులు

అమరావతి: ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 33 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న మిత్రులు నేడు ఒక్కటయ్యారు. దేశ విదేశాల నుంచి పాఠాలు నేర్పిన పాఠశాలకు చేరుకున్నారు. అమరావతి శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్ 1989–90 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీ సమ్మేళన కార్యక్రమం ఆదివారం స్కూల్లో జరిగింది. చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరు పలుకరించుకొని, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి తరగతి గదిలో పాఠాలు విన్న 250 మంది విద్యార్థుల్లో దాదాపు 150 మంది కలుసుకొని కుశల ప్రశ్నలు వేసుకొన్నారు. ఈ సమ్మేళనం అర్గనైజింగ్ కమిటీ సభ్యులు యాయవరం గోపి, వాకా వెంకట సత్యనారాయణ, గుడిశె నాగేశ్వరరావు, శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. తమ వివరాల పత్రాలను పూర్తి చేసి ఒకరి నొకరు, పరిచయం చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులందరినీ సన్మానించారు. 2013లో పాఠశాలలో తమవంతుగా రూ. 4.5లక్షలతో తరగతి గది నిర్మించిన ఈ పూర్వ విద్యార్థులు.. భవిష్యత్‌లో అదేవిధంగా ముందుకు పోవాలని నిర్ణయించారు.

గొప్ప ధీశాలి ఛత్రపతి శివాజీ



ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: భారతదేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన ధీశాలి ఛత్రపతి శివాజీ అని బీసీ సంఘాల నాయకులు కొనియాడారు. పట్టణంలోని నాగార్జున నగర్‌లో ఛత్రపతి శివాజీ 393 జయంతి సందర్భంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలుగు సంవత్సరం, 1670 సంవత్సరం, జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి నాడు ఛత్రపతి శివాజీ పట్టాభిషేక వార్షికోత్సవం జరిగిన సందర్భంగా హిందూ సామ్రాజ్య దివాస్ జరుపుకొంటారన్నారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘ నాయకులు చింకా అంకమ్మ రావు, గుంజి విజయ్ కుమార్, డీపీఎం రాజు, ప్రత్తిపాటి హరే కృష్ణ, విప్పర్ల ఏడుకొండలు, పిక్కలి రత్తయ్య, పులహరి బానోజీ, కుమ్మరి దస్తగిరి, గుంటూరు గోవిందు ఉన్నారు.

కోనేటిలో విహరించిన మరకత లింగేశ్వరుడు



నర్సింగపాడులోని కోనేటిలో మరకత లింగేశ్వర స్వామి తెప్పోత్సవం

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న మరకతలింగేశ్వర స్వామి వారి ఆలయకోనేటిలో స్వామివారి తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి విశేషపూజాధికాల అనంతరం సుందరంగా అలంకరించిన కోనేటిలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి తెప్పించిన వివిధరకాల పూలతో రూపొందించిన హంసవాహనంపై స్వామివార్లు కొలువుదీరగా స్వామివారి నామస్మరణతో ఆప్రాంతం మార్మోగింది. పలుగ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి ఉత్సవాన్ని తిలకించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. అనంతరం చేపట్టిన అన్నదానంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఆదర్శనీయుడు

మాచర్ల: విద్యార్థులు స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని విద్యను అభ్యసించాలని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో రామకృష్ణ మిషన్ 125వ ఆవిర్భావ వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం విద్యార్థినులకు పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ప్రసన్న, శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

26న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామి 31వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 26వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా 24వ తేదీ తెల్లవారుజామునుంచి ఆలయంలో హరేరామ నామ సంకీర్తన ఏకాహం, 25న స్వామి వారికి ప్రత్యేక పూజలు, అన్నదానం, 26న హనుమద్దీక్ష విరమణ, సామూహిక ఆకు పూజలు, పొంగళ్ళు సమర్పణ, సాయంత్రం తిరునాళ్ళ మహోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం హనుమత్‌జ్యోతిదర్శనం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో గల చెక్‌పోస్ట్ వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన మల్లెల గణేష్ (17) ద్విచక్ర వాహనంపై పేరేచర్ల నుంచి పిడుగురాళ్ల వైపు వెళుతుండగా నరసరావుపేట రోడ్ లోని చెక్ పోస్ట్ వద్దకు వచ్చేసరికి లారీని ఢీకొని తలకు బలమైన రక్తగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ యు.శోభన్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి శివలింగానికి మహా రుద్రాభిషేకం




రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లిలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శివాలయంలో మహారుద్రాభిషేకం జరిగింది. అప్పటికప్పుడు మట్టితో తయారు చేసిన శివలింగానికి గుంటూరు అమ్మా ఆశ్రమం బాబా, వారి మిత్ర బృందంచే రుద్రాభిషేకం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రుద్రాభిషేకాన్ని తిలకించారు. ఆ సమయంలో ఓం శివ నామ స్మరణంతో ఆప్రాంతం మారుమోగింది. అనంతరం భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.



“స్వయంకృషివలునికి”

జన్మదిన శుభాకాంక్షలు





సామాన్య రైతు కుటుంబంలో జన్మించి,
స్వయంకృషితో తన జీవన యాత్ర ప్రారంభించి
నేడు రాష్ట్ర వ్యాప్తంగా గర్వించదగ్గ పారిశ్రామికవేత్తగా ఎదిగి,
పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడం ద్వారా
ఎందరో పాడిరైతులకు, మరెందరికో ప్రత్యక్షంగా,
పరోక్షంగా జీవనోపాధి కల్పించిన రైతు జనబాంధవుడు
మన ప్రియతమ శాసనసభ్యులు

“శ్రీ బొల్లా బ్రహ్మనాయుడు” గారికి

జన్మదిన శుభాకాంక్షలు



బొల్లా శ్రీనివాసరావు
మేనేజింగ్ డైరెక్టర్



బొల్లా గిరిబాబు
మేనేజింగ్ డైరెక్టర్



ఈదర నాగేశ్వరరావు
డైరెక్టర్



వీరవల్లి సుబ్బయ్య
డైరెక్టర్



రామినేని శ్రీనివాసరావు
డైరెక్టర్



చింతా గిరిబాబు
డైరెక్టర్

VALLHABHA
HOMES
Building Joys Forever!

వినుకొండ పట్టణంలో
ప్రప్రథమంగా
గేటెడ్ కమ్యూనిటి
నిర్మిస్తున్న
ఏకైక సంస్థ
వల్లభ హోమ్స్

VALLHABHA
MOUNT NEXT
A NEXT LEVEL LIFESTYLE

వల్లభ ఫీడ్స్ ప్రై.లిమిటెడ్

బైపాస్‌రోడ్, నరసరావుపేట, గుంటూరు జిల్లా.
సెల్: 97041 96777, 96408 36999

తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థలు

పిడుగురాళ్ళ

వల్లభ మిల్క్ ప్రొడక్ట్స్ ప్రై.లిమిటెడ్

వెంకుపాలెం గ్రామం వినుకొండ; కాణిపాకం చిత్తూరు; మల్కాపూర్ హైదరాబాద్
సెల్: 99851 03777, 93810 27234, 98857 35363, 91211 55555

